# మీసాలున్న మహిళలు - హిర్సుటిజం

**స్త్రీగా ఉండటం వల్లే అనేక ఇబ్బందులెదుర్కొంటుంటే, - స్త్రీగా ఉండకుండా చేసే వైద్య సమస్య హిర్సుటిజమ్ - నయం చేయొచ్చుననన్న విశ్వాసాన్ని వైద్యం పీడితులకిస్తుంది.**

ప్రకృతిసిద్ధమైన శారీరక మానసికతత్వానికే మహిళలు సమాజంలో అనేక రకమైన ఇబ్బందులకు, అవమానాలకు గురవుతుంటే, ఇక హిర్సుటిజమ్ లాంటి వ్యాధుల పాలపడ్డ మహిళల ఇబ్బందిని ఊహించడం పెద్ద కష్టం కాదు. పైగా ఈ సమస్య చాలామందినే పట్టి పీడిస్తుంది. అసలు ఇబ్బందితో పాటు ఈ సమస్యను భరించే స్త్రీలల్లో చాలామంది డాక్టరును సంప్రదించడానికే బిడియపడడంతో పరిష్కారానికి మరింత అడ్డంకులేర్పడుతున్నాయి. అందుకే హిర్సుటిజమ్ బాధితులు తీవ్రమైన మానసికాందోళనల్లో కొట్టుమిట్టాడుతుంటారు. పైగా ఈ సమస్య కేవలం అందానికి, లేదా ఆకారానికి సంబంధించింది కాదు. కొన్నిసార్లు హిర్సుటిజం శరీరంలోని హార్మోన్ల అస్థిరత, వాటి పర్యవసానంగా సంతాన సాఫల్యానికి ప్రమాదాలేర్పడే స్థితిని కూడా సూచిస్తుంది. అందుకే వైద్యరంగం ఈ సమస్య పట్ల మహిళల్లో అవగాహన పెరిగేలా చూడడానికి కృషి చేస్తుంది.



హిర్సుటిజం సాధారణంగా కౌమార్యం నుంచి యవ్వనం వరకూ వచ్చే అవకాశాలున్నాయి. ఈ దశలోనే మహిళల్లో హార్మోన్ల ప్రక్రియలు మొదలై వృద్ధి చెందుతాయి. ఆ క్రమంలో, ఒకవేళ పురుష సంబంధిత హార్మోన్లు (టెస్టోస్టిరాన్, ఆండ్రోజన్స్) నిష్పత్తి అధికమైతే హిర్సుటిజంకి దారితీస్తుంది. అంటే మగవాళ్ళమాదిరిగా ముఖంపై వెంట్రుకలు (మీసాలు, గెడ్డాలు) రావటం జరుగుతుంది. హిర్సుటిజం తీవ్రత ఎక్కువగా ఉన్న మహిళల్లో కొందరికైతే పురుష లక్షణాలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. బట్టతల, కంఠంలో కరకుదనం (మగవారి గొంతులా) రావటంతో పాటే స్త్రీత్వపు సహజలక్షణాలైన స్తనాలు కుంచించుకుపోవడం, రుతుక్రమం క్షీణించడం. సంతాన వైఫల్యానికి (వంధ్యత్వం) దారి తీస్తుంది కొంతమంది "వంశవృక్షం"లో కూడా ఈ సమస్య ఉండే అవకాశాలున్నాయి.

అయితే హిర్సుటిజంకి ముఖ్యకారణాలు చాలా నిర్దిష్టమైనవే. సాధారణంగా మహిళల్లో పురుష హార్మోన్ల శాతం కనిష్టస్థాయిలో వుంటాయి. అయితే జీవప్రక్రియల్లో ఏ కారణం చేతనైనా వాటి శాతం పెరిగితే హిర్సుటిజంకే దారితీస్తుంది. ఇక ముఖం, ఇతర ప్రదేశాల్లో బహిర్గతమయ్యే కేశాల గురించి : మనిషికి (ఆడా, మగా) రెండు రకాల కేశాలుంటాయి.

1. మృదువుగా వంకీలుగా ఉండే వెల్లస్ హెయిర్
2. పెళుసుగా రంగు మారి ఉండే టెర్మినల్ హెయిర్.

కొన్ని జాతుల్లో స్త్రీలకు ముఖం మీద వెల్లస్ హెయిర్ ఉండటం మామూలే. అంతేకాకుండా సాధారణ మహిళల్లో కూడా ఓ మోస్తరుగా ముఖం మీద కేశాలుండటం కద్దు. పురుష హార్మోన్ల ఎక్కువ తక్కువల ప్రమేయం లేకుండా, ఇతర సమస్యల అంటే థైరాయిడ్ గ్రంథి లోపాల వల్లగానీ, పేగుగుదలకు సంబంధించిన హార్మోన్ల హెచ్చుతగ్గులవల్లగానీ, లేదా అనొరెక్సియా నెర్వోసా వల్ల గానీ, ముఖం మీద వెంట్రుకలు రావటం జరుగుతుంది.

కానీ ఎప్పుడైతే ముఖం మీదనే కాకుండా, ఛాతీమీద, పొట్ట మీద వెనకభాగంలోనూ కూడా కేశాలు మొలిస్తే సమస్యను తేలిగ్గా తీసుకోవటం ప్రమాదకరం. ముఖ్యంగా వెంట్రుకలతోపాటు, రుతుక్రమంలో మార్పులు, ఆక్నె (నల్లటి చిన్న మచ్చలు) లాంటి సమస్యలు కూడా బయటపడితే వెంటనే సంబంధిత వైద్య పరీక్షలు జరిపి చికిత్సకుపక్రమించాల్సిందే.

హిర్సుటిజంలో ఏం జరుగుతుంది

మామూలుగా పురుష హార్మోనైన ఆండ్రోజన్లు అండాశయంలోగానీ, అడ్రినల్ గ్రంథుల్లో కానీ ఉత్పత్తి అవుతాయి. ఈ సమస్యా పీడితుల్లో 50శాతం మందిలో వాళ్ళ అండాశయంచుట్టూ చిన్నచిన్న కంతులు ఏర్పడతాయి. కేవలం 5 శాతం కేసుల్లో మాత్రం ఇలాంటి కంతులేర్పడటానికి కారణం అండాశయం. అడ్రినల్ గ్రంథులలో హార్మోన్లస్రావానికి దారి తీసే ట్యూమర్లున్నా కానీ, లేదా అడ్రినల్ హైపర్ ప్లేసియా లాంటి అడ్రినల్ గ్రంథుల్లోని ఎంజైమ్‌ల లోపం కానీ అవొచ్చు. అందుకే చాలామందికి హిర్సుటిజంతో పాటు లావెక్కడం, రుతుక్రమంలో అడ్డంకులు ఒకేసారి వస్తాయి.

ఈ సమస్యకు కష్టసాధ్యమే అయినా పరిష్కారం ఉందనే చెప్పుకోవాలి. అయితే బాధితులూ, వైద్యుడూ ఎప్పుడూ పరస్పరం సహకరించుకుంటేనే గాని సమస్య నదుపు చేయటం సాధ్యపడదు. సరైన హార్మోన్ల పరీక్షలు, రేడియోలాజికల్ పరీక్షలు జరిపి హిర్సుటిజం మూలకారకాన్ని కనుక్కోవాలి చికిత్సా క్రమంలో సమస్యనదుపు చేయడానికిగాను మహిళల బరువు తగ్గించే చర్యలు వెంటనే చేపట్టాలి. ఇక మందుల్లో - ఆంటీ ఆండ్రోజన్ మిశ్రమాలు, మిశ్రమ హార్మోన్ల మాత్రలు వైద్య పర్యవేక్షణలో వాడాలి. మందులు, ఆహారపు అదుపుతో, బ్లీచింగ్, ప్లక్కింగ్ (వెంట్రుకల్ని పెరికివేయడం), వాక్సింగ్ ఎలక్ట్రాలసిస్, రసాయనిక విధానంలో వెంట్రుకల్ని నిర్మూలించటంలాంటి విభిన్న పద్ధతుల్లో ఈ సమస్య



నెదుర్కోవాలి. ఇంత విస్తృత పరిధిలో ఎదుర్కొంటేనే కానీ హిర్సుటిజంని అదుపు ... చికిత్సకి దాదాపు 6-9 నెలలు వరకు పడుతుంది. చాలాసార్లు పేషంట్లు ఇంత బాధ్యతని భరించడానికి వెరవటం కూడా జరుగుతుంది. అడ్రినల్ గ్రంథుల హార్మోన్లు సమస్య కారణాలైతే స్టెరాయిడ్స్ వాడి చికిత్స చేయవచ్చు, కానీ అరుదైన కేసుల్లో అడ్రినల్, అండాశయ కంతుల్ని తొలగించడానికే శస్త్రచికిత్స (సర్జరీ) అవసరమవుతుంది. ఏదేమైనా చికిత్స భారమూ, సంక్లిష్టమే అయినా ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, ఆరోగ్యాన్ని హరించివేసే ఈ హిర్సుటిజమ్, పేషెంట్- డాక్టరు కలిసి ఎదుర్కొంటే అదుపులోకి రావటంతో పాటు పూర్తిగా నయమయిపోతుంది కూడా. మహిళలీ సమస్యకు జంకక, ధైర్యంగా పరిష్కారం వేపే అడుగెయ్యాలి.

- డా. కె.డి. మోడి, ఎండోక్రైనాలజిస్ట్
డా. యం. విమల, రెసిడెంట్
కామినేని హాస్పటల్స్